క్లుప్తంగా

బాక్సింగ్ పోటీల్లో సత్తా



విద్యార్థులను సత్కరిస్తున్న కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు

అవుకు: విజయవాడలో గత నెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో అవుకు మదర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పతకాలు సాధించిన ఆరుగురు విద్యార్థులను శనివారం పాఠశాల కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు సత్కరించారు. జాహ్నవి, కరిష్మాలకు వెండి పతకాలు, నవ్య, మహిత, సాయిశ్రీ, చైతన్యలక్ష్మిలు కాంస్య పతకాలు సాధించారని కరస్పాండెంట్ తెలిపారు.

వంద పడకల ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

డోన్ టౌన్ : పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి ఎంఆర్ఐ, సిటీ స్కాన్ మిషన్లతో పాటు అన్ని రకాల వైద్య పరికరాలు అందించి పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. శనివారం ప్యాపిలి మండలం బోయ వాండ్ల పల్లి గ్రామ సమీపంలోని వాల్మీకి గుహల వద్ద ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన మంత్రిని డోన్ బీజేపీ నాయకులు కలిసి విన్నవించారు.

కాపుపల్లెలో గ్రామ సభ

బనగానపల్లె రూరల్: మండలంలోని కాపుపల్లె గ్రామంలో శనివారం రీ సర్వే భూసమస్యల పై గ్రామ సభ జరిగింది. మండల సర్వేయర్ గీతా భవాని, ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు ప్రసాద్, వేణుగోపాల్, కుళ్లాయి, గ్రామ సర్వేయర్ మధు తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

11న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నంద్యాల(అర్బన్): దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 11న పట్టణంలోని ముల్లాన్ పేట మున్సిపల్ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబిహా పర్వీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జీవిత చరిత్ర, వారి సేవలు అనే అంశంపై జిల్లాలోని వివిధ ఉర్దూ పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గెలుపొందిన విద్యార్థులకు అదే రోజు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేస్తామని వెల్లడించారు.

5న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5వతేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.శశికళ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకుంటారన్నారు. ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు జీతం ఉంటుందన్నారు. 18 నుంచి 28 సంవత్సరాలలోపు వయస్సు కలిగి పది ఆపై విద్యార్హత ఉన్న అభ్యర్థులు మేళాకు హాజరుకావాలన్నారు.

10న స్విమ్మింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): రాజమండ్రిలోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 10వ తేదీన 7వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మీనారాయణ రెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్‌పూల్ వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే మాస్టర్స్ స్విమ్మర్స్ ఈ నెల 5వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు వచ్చే డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. బుచ్చన్న, సుధాకర్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆర్‌యూ అభివృద్ధి

కర్నూలు కల్చరల్: అందరి సహకారంతో రాయలసీమ విశ్వవిద్యాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.వి జయ్‌కుమార్ నాయుడు పేర్కొన్నారు. వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీ పాలనను గాడిలో పెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వసతి గృహాల్లో నీటి సమస్యను పరిష్కరించేందుకు వీసీ ఆదేశాలతో బోర్లను బాగు చేయించినట్లు చెప్పారు. రానున్న వేసవిలో నీటి కొరత తలెత్తకుండా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తున్నామన్నారు. వర్సిటీ పరిధిలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు సరైన సమయంలో పరీక్షల నిర్వహణకు, ఫలితాల ప్రకటన, సర్టిఫికెట్ల జారీకి సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ర్యాగింగ్‌ను పూర్తిగా నియంత్రించేదుకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

మహిమాన్వితం.. యాగంటి క్షేత్రం

- శివపార్వతుల దర్శనంతో సర్వపాపాలు హరణం
- కార్తీక మాసం ప్రారంభంతో పోటెత్తుతున్న భక్తులు



ఆలయ ముందుభాగంలో విశాలమైన రహదారిపై సెంట్రల్‌లైటింగ్ సౌకర్యం



పెద్దపుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



విగ్రహ రూపంలో ఆదిదంపతులు



రోజురోజుకు పెరుగుతున్న నందీశ్వరుడు

బనగానపల్లె: రాష్ట్రంలోని శైవక్షేత్రాల్లో ఎంతో ప్రసిద్ధి గాంచిన యాగంటి క్షేత్రం మహిమాన్వితమైంది. ఇక్కడి ఉమామహేశ్వరస్వామిని దర్శించుకుంటే సర్వపాపాలు నయమవుతాయని భక్తుల నమ్మకం. కార్తీక మాసం ప్రారంభంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇక్కడి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4న మొదటి సోమవారం, 11న కార్తీక మాస రెండో సోమవారం, 15న కార్తీక మాసం సందర్భంగా పౌర్ణమి పూజలు అదే రోజు సాయంత్రం లక్ష దీపోత్సవం, 18న కార్తీక మాస మూడో సోమవారం, 25న కార్తీక మాస నాల్గవ సోమవారాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

ఆలయ చరిత్ర..

మండలంలోని పశ్చిమ భాగాన ఎర్రమల కొండల్లో పర్వత సానువుల మధ్య మహిమాన్వితమై నెలకొని ఉన్న యాగంటి క్షేత్రానికి ఎంత పవిత్రత ఉంది. విజయనగర సామ్రాజ ప్రభువులైన హరిహర బుక్క రాయులు ఈక్షేత్రాన్ని నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. అప్పటి నుంచి ఎందరో మహానుభావులు ఈ ఆలయాన్ని సందర్శించినట్లు ప్రతీతి. దేవస్థానంలో విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాముల వారు సంచరించి, శ్రీవారిని సేవించి గరిమిరెడ్డి అచ్చమ్మకు జ్ఞానబోధ చేసినట్లు ప్రతీతి. ఉమామహేశ్వరస్వామి నందివాహన శిలా వెలసి తమై ఆదిదంపతులు విగ్రహ రూపంలో విలసిల్లిన ఏకైక పుణ్యక్షేత్రం యాగంటి క్షేత్రం. ప్రకృతి వరప్రసాదులుగా పెద్ద కోనేరు, చిన్న కోనేరు వెంకటేశ్వర స్వామి గుహతోపాటు మరిన్ని ప్రాముఖ్యత సంతరించుకున్న గుహలు, రోజురోజుకు పెరుగుతున్న నందీశ్వరుడు, ఎత్తైన గాలిగోపురం ఇంకా మరెన్నో ఆసక్తి అంశాలు ఇక్కడి క్షేత్రం సొంతం.

గత ప్రభుత్వ హయాంలో మహర్దశ

గత వైఎస్సార్‌సీపీ హయాంలో యాగంటి క్షేత్రంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఫోర్‌లైన్ రోడ్డును సెంట్రల్ లైటింగ్ సిస్టంతో ఏర్పాటు, ఆలయ ప్రవేశ దారి, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి, భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు విశాలమైన షెడ్డు నిర్మాణంతో పాటు ఆధునిక వసతులతో కూడిన సామూహిక మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టారు. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పెద్ద కోనేరు చుట్టు, లోపాలి భాగంలో గ్రానైట్ రాయి ఏర్పాటు, చిన్న కోనేరు నుంచి పెద్ద కోనేరు వరకు ప్రవహించే నీటి కోసం డ్రైనేజీ అభివృద్ధి, ఆలయ పరిసర ప్రాంతంలో పిడుగు పడకుండా (లైటింగ్ అరెస్టర్) ప్రత్యేక మిషన్ ఏర్పాటు, గాలిగోపురానికి పెయింటింగ్ తదితర అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

ప్రశాంత జీవనం సాగించాలి



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి

అవుకు: ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఫ్యాక్షన్ జోలికి వెళ్లొద్దని ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి సూచించారు. మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యాక్షన్ పికెట్‌ను శనివారం ఎస్ఐ రాజారెడ్డితో కలిసి ఆయన తనిఖీ చేశారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. ఫ్యాక్షన్ మూలంగా జరిగే నష్టాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఐకమత్యంగా ఉండాలని, అప్పుడే పల్లెలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. నేర నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎవరైనా గొడవలు, అల్లర్లు ప్రేరేపించినా అప్రమత్తంగా మెలగాలని సూచించారు. గ్రామంలోకి ఎవరైనా వచ్చినా, ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినా తక్షణమే పోలీసులకు సమాచారం అందిస్తే రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు జరుగుతుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ



కోవెలకుంట్ల: సమాధులను అలంకరించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



బనగానపల్లె: సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ దైవదీనం

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవ సోదరులు శనివారం సమాధుల(ఆత్మల) పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మృతి చెందిన వ్యక్తుల ఆత్మలు దైవ సన్నిధికి చేరడానికి ప్రతి ఏటా నవంబర్ 2వ తేదీన ఆత్మల దినోత్సవం జరుపుకుంటున్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ క్రైస్తవులు స్మశానవాటికలకు చేరుకుని సమాధులను రంగులు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. ఈ మేరకు పట్టణ శివారులోని స్వామినగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాల్లోని ఉన్న శ్మశాన వాటికల్లో ఆయా చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బనగానపల్లె రూరల్ : మండలంలో పలు గ్రామాల్లో సమాధుల పండగను శనివారం క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని వెంకటాపురం రోడ్డులో ఉన్న శ్మశానవాటికలో క్రైస్తవులు తమ కుటుంబ సభ్యుల సమాధులను ప్రత్యేక పూలతో అలంకరించారు. కోవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ఆరాధనలు చేశారు. స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చి రెవరెండ్ దైవదీనం, మదర్‌థెరిస్సా చర్చి ఫాదర్ బాబురాజ్ సమాధుల వద్ద ప్రత్యేక ఆరాధనలు చేశారు.

గ్రామాల అభివృద్ధిపై నివేదికలు రూపొందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: మండలంలోని సంచార జాతులు, ఎస్సీ కాలనీల అభివృద్ధికి నివేదికలు రూపొందించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ మల్లికార్జున, పంచాయతీ రాజ్ ఇంజినీర్ మహేష్, సూపరింటెంట్ దస్తగిరి బాబు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సంచార జాతులను గుర్తించి విద్య, వైద్యం, ఇంటి స్థలాలు, ఉపాధి కల్పించడానికి, అలాగే ఎస్సీ కాలనీల్లో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, వీధి లైట్లు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నివేదికలు తయారు చేయాలన్నారు.

అవినీతి రహిత సమాజంలో భాగస్వాములు కావాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: అవినీతి రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడంతో విద్యార్థులు భాగస్వాములు కావాలని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పీవీఎస్ఎస్ శర్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలన అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతిభ కనపర్చని విద్యార్థులు పెద్దిరాజు, రామభద్ర, అంజలికి నగదు బహుమతులు అందజేశారు. అనంతరం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధులను కళాశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భార్గవరాముడు, జూనియర్ ఇంజినీర్ ఎంవీఎస్ శర్మ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం,పేండేకల్లు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నారనే సమా చారం మేరకు శనివారం దాడులు నిర్వహించినట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు. ఆ గ్రామానికి బోగోలు ఎర్రమల అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో అదుపులోకి తీసుకొని 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ చెప్పారు.

నాసాలో డోన్ విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్ : నాసా ఓరియన్ ప్రాజెక్టు పరీక్షల్లో డోన్ కు చెందిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు స్కూల్ ఏజీఎం సురేష్ తెలిపారు. ఈ స్కూల్ నుంచి మొత్తం 36మంది విద్యార్థులు పాల్గొని చేసిన ప్రాజెక్టును శ్రీహరి కోటలోని నాసా కార్యాలయానికి పంపంగా 10 ప్రాజెక్టులు అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యా యని చెప్పారు. నాసా కేంద్రం వారు పంపిన మెడ ల్స్, షీల్డు, ప్రశంసా పత్రాలను శనివారం విద్యార్థులకు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జ్ కోటయ్యచౌదరి, ప్రిన్స్‌పాల్ ఉమారెడ్డి, కోఆర్డినేటర్ రమణ, మద్దిలేటి, రంగడు, వైస్ ప్రిన్స్‌పాల్ సువర్ణదేవి, నాసా ఇన్‌చార్జ్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాలుట్ల రంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామ సమీపాన కొండలో వెలసిన పాలుట్ల రంగస్వామికి కార్తీక మాసం శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు విష్ణువర్ధన్ ఆచార్యులు శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి సమేత పాలుట్ల రంగస్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణతోపాటు అన్నదానం చేశారు.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

- ఎలాంటి లోపం లేకుండా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి చేపట్టాలి
- కార్తీక మాసోత్సవాల ఏర్పాట్ల పరిశీలించిన ఇన్‌చార్జ్ ఈఓ





కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఈఓ, ప్రత్యేక విధులపై శ్రీశైలం వచ్చిన పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శ్రీశైల మహాక్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి ఇ.చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఆయన క్షేత్ర పరిధిలోని ఆలయ మాఢవీధులు, ఆలయ పుష్కరిణి, అన్నప్రసాద వితరణ, పాతాళగంగ, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఆలయ ఉత్తర మాఢవీధి, గంగాధర మండపం వద్ద భక్తులు కార్తీక దీపాలను వెలిగించుకునేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోపాలు లేకుండా పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పుష్కరిణి వద్ద లైటింగ్, విద్యుదీపాలంకరణ అకర్షణీయంగా ఉండాలని ఆదేశించారు. పాతాళగంగ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలని చెప్పారు. ఈ పరిశీలనలో దేవస్థాన ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎం.నరసింహారెడ్డి, ఏఈలు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

–భారీ పోలీసు బందోబస్తు

శ్రీశైలం: కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. శనివారం ఉదయం శ్రీశైలంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో జరిగిన సమావేశంలో కర్నూలు, నంద్యాల, నందికొట్కూరు తదితర నియోజకవర్గాల నుంచి సుమారు 300 మంది పోలీసులు ప్రత్యేక విధులపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, శ్రీశైలానికి వచ్చే రహదారి ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వారికి దశ దిశ నిర్దేశం చేయాలని పోలీసు సిబ్బందిని సూచించారు. దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూడా ప్రత్యేక విధులపై నైపుణ్యం గల పోలీసులను నియమిస్తున్నామని అన్నారు. ఇప్పుడు ఎక్కడ, ఎలాంటి సంఘటన జరిగినా వైర్‌లెస్ సెట్‌ల ద్వారా వెంటనే సమాచారం సంబంధిత అధికారులకు తెలియజేయాలని చెప్పారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ప్రసాద్‌రావు, చంద్రబాబు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు అన్నదానం



అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాటసాని సోదరులు

బనగానపల్లె: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి అన్నదాన కమిటి ఆధ్వర్యంలో శనివారం ఉచిత అన్నదాన శిబిరాన్ని సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్పస్వామి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో దీక్ష స్వీకరించిన స్వాములకు ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరం మకరజ్యోతి వరకు ఉంటుందని, స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: స్థానిక హరిహర అయ్యప్పస్వామి దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శనివారం నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ గడ్డం నాగేశ్వర రెడ్డి, ఆలయ ధర్మకర్త విశ్వనాథం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా అయ్యప్ప, శివ, వెంకటేశ్వర, నరసింహ, ఆంజనేయస్వామి మాలాధారణ భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కార్తీకమాసం మొదటి రోజు నుంచి వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మురళీకృష్ణ, కానాల రవీంద్రనాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, కొండలరావు, శివారెడ్డి, శివ మనోహర్ పాల్గొన్నారు.

కార్తీక మాస పూజలు ప్రారంభం

కొలిమిగుండ్ల: మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభమైంది. శివాలయాలన్నీ కార్తీక దీపకాంతులతో వెలిగిపోయాయి. బందార్లపల్లె సమీపంలోని నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న బిలంలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కొలిమిగుండ్ల లలితా సుందరేశ్వర స్వామి ఆలయం, పెట్నికోట సమీపంలోని గుండు మల్లేశ్వరస్వామి, బెలుం సిద్ధరామేశ్వరస్వామి, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం మొదటి శనివారం సందర్భంగా ఉమ్మాయిపల్లె గ్రామస్తుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. స్వామికి తెల్లవారు జామునే ఆకుపూజ, అభిషేకం నిర్వహించారు.

6న మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన ఈనెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి శనివారం తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.